పసుపు @ రూ.13,559

మెట్‌పల్లి, ఏప్రిల్ 13: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం పసుపు ధరలు నిరాశను మిగిల్చాయి. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 13,559, కనిష్ఠంగా రూ9,509, గోళకు గరిష్ఠంగా రూ.13,026, కనిష్ఠంగా రూ.11,511, ఈ ఒక్కరోజు కేవలం 32 క్వింటాళ్ల పసుపు మాత్రమే కొనుగోలు జరిగింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మార్కెట్‌లో 26,861 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

రేపు సారంగాపూర్ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

సారంగాపూర్, ఏప్రిల్ 13 : మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు గుర్రాల రాజేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

ఉద్యోగ విరమణ పొందిన వెంకట్రాములును సన్మానిస్తున్న జగిత్యాల జిల్లా హిందీ ఫోరం సభ్యులు

మేడిపల్లి, ఏప్రిల్ 13 : మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా శ్రీపాద వెంకట్రాములు బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందారు. పదో తరగతి మూల్యాంకన జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం జగిత్యాల జిల్లా హిందీ ఫోరం ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ పొందిన శ్రీపాద వెంకట్రాములను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా హిందీ కన్వీనర్ కస్తూరి శ్రీధర్, కో కన్వీనర్ ఫసియొద్దీన్, శ్రీనివాస్, మహిళా కో కన్వీనర్ ఎం నీలిమ, సలహాదారు ఎం శంకరయ్య, సభ్యులు సుధాకర్, వసంతరావు, కవిత, వీ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All
WANTED
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అర్వింద్ హయాంలో అభివృద్ధి సున్నా

- ఇప్పుడున్నది డూప్లికేట్ కాంగ్రెస్
- కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సుభిక్షం
- గెలిపిస్తే మాటల్లో కాదు చేతల్లో చూపుతా
- నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- ఇబ్రహీంపట్నం, రాయికల్‌లో విస్తృత ప్రచారం

ఇబ్రహీంపట్నం : సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ఇబ్రహీంపట్నం/రాయికల్ ఏప్రిల్ 13: 'ఎంపీ అర్వింద్ హయాంలో నిజామాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సున్నా..ఆయన మాటలు తప్పా చేసిందేమీలేదు.' అని నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నిప్పులు చెరిగారు. పసుపు బోర్డు తెస్తానని చెప్పి కాలయాపన చేసి ఇక్కడి పసుపు రైతులను నిండా ముంచారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇప్పుడున్నది డూప్లికేట్ కాంగ్రెస్ అని..ఆ పార్టీ అభ్యర్థికి ఓటేస్తే ఒరిగేదేమీ ఉండదన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదని చెప్పారు. శనివారం ఆయన ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ ఎమ్మెల్సీ వీజీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నానికి చేరుకున్న బాజిరెడ్డికి మహిళలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఇబ్రహీంపట్నం, రాయికల్‌లోఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఉమ్మడి పాలనలో అన్నింటా వెనుకబడ్డ తెలంగాణ కేసీఆర్ హయాంలో అన్నిరంగాల్లో ముందు నిలిచిందన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల కన్నీళ్లను తుడిచారన్నారు. కాళేశ్వరం నిర్మించి రైతుల కష్టాలను దూరం చేశారని చెప్పారు. కేసీఆర్‌ను బద్‌నాం చేసేందుకే కాంగ్రెస్ సర్కారు మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేయడంలేదన్నారు. కేసీఆర్ గెలిస్తే మూడు నెలల్లో బరాజ్ ఫిల్లర్లకు రిపేర్ చేయించి రైతులకు పుష్కలంగా సాగునీరందించి చేవారన్నారు. తనను గెలిపిస్తే మాటల్లో కాదు అభివృద్ధిని చేతల్లో చూపుతానని పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఇక్కడ వైస్‌ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, మండల కార్యదర్శి నేమూరి సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, పద్మశాలీ సంఘం రాష్ట్ర నేతలు సురేశ్, నేతలు జగన్‌రావు, కంఠం రమేశ్, చిన్నారెడ్డి, జేడీ సుమన్ రాయికల్‌లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపిరెడ్డి, ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హనుమాండ్లు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, బతుకమ్మతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలె..

కేసీఆర్ పాలనలో అన్ని గ్రామాలు పచ్చబడ్డయ్. ఇక్కడ బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చింది లేదు..అభివృద్ధి చేసిందేమీలేదు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దు. కారుకు ఓటేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలె.

- జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్యపెడుతున్నారు. ఆ రెండు పార్టీలో ఢిల్లీలో కుస్తీ పడుతున్నట్లు నటిస్తూ గల్లీలో దోస్తీ చేస్తున్నాయి. అధికారం కోసం సిద్ధాంతాలను పక్కనబెట్టి ఒక్కటవుతున్నాయి. తెలంగాణ ప్రజల కోసం కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. ప్రజలు ఆలోచించి ఓటేయాలి. తెలంగాణ హక్కుల కోసం పార్లమెంట్‌లో గళమెత్తే బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించాలి.

-రాయికల్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం..

కొందరు అధికారం ఉన్నదనే అండతో విర్రవీగుతున్నరు. ప్రత్యర్థులపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నరు. ఇది పద్ధతి కాదు. మా కార్యకర్తల జోలి కొస్తే ఊరుకోం. అర్ధరాత్రి వేళలోనూ అండగా ఉంటాం. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి నా లుగునెలలు దాటినా ఆ ఊసే ఎత్తడంలేదు. బీజేపీ వాళ్లు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పకుండా దేవుడి పేరిట ఓట్లడుగుతున్నరు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ నాయకుల ఝుటా మాటలు నమ్మద్దు..కారు ఓటేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి.

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

చెయ్యికి ఓటేస్తే ఒరిగిందేమీలేదు..

చెయ్యికి ఓటేస్తే ప్రజలకు ఒరిగిందేమీ లేదు. రేవంత్ సర్కారు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదు. ప్రజా సమస్యల పై నిలదీస్తే మేడిగడ్డ కుంగిందంటూ ఫోన్ ట్యాపింగ్ అంటూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నది. బీఆర్ఎస్ పాలనలో వరదకాలువలు నీళ్లతో కళకళలాడుతుండే. కాంగ్రెస్ హయాంలో చుక్కనీరు దిక్కులేక వెలవెలబోతున్నయ్. బీజేపీ నేతలు పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీ పేరిట ఓట్లు దండుకున్నరు. మళ్లీ ఎన్నికల ముందర మాయమాటలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నరు. ప్రజలకు న్యాయం జరుగాలంటే కారుకు ఓటేయాలె.

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కొప్పుల ఈశ్వర్ కారు తనిఖీ

పెగడపల్లిలో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్ కారును తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

పెగడపల్లి , ఏప్రిల్ 13 : పెగడపల్లి మండల కేంద్రంలో శనివారం మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారును ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. కొప్పుల ఈశ్వర్ పెగడపల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా, అక్కడకు వచ్చిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కరుణ సిబ్బంది కారును తనిఖీ చేశారు. కారులో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి వస్తువులు కాని నగదు కాని లేవని ఎన్నికల అధికారి కరుణ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్, ఏప్రిల్ 13 : రాయికల్ మండల కుమ్మరిపల్లి గ్రామ బీఆర్ఎస్ కార్యకర్త వొళ్లాల అరుణ్ తండ్రి రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గ్రామానికి చెందిన కార్యకర్త కొడిమ్యాల రాజు తండ్రి బాలయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. అయన వెంట జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు దొంతి నాగరాజు, మాజీ సర్పంచ్ స్వప్నవెంకటేశ్వర్ రెడ్డి, తిరుపతి గౌడ్, నాయకులు సంకె సాగర్, మధు, వీరస్వామి, నవీన్, రఫీ, మల్లేశ్ తదితరులున్నారు. అలాగే రాయికల్ పట్టణం 11వ వార్డు యూత్ నాయకులు రాజేందర్ తల్లి రాజు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, శ్రీధర్ రెడ్డి, బాబా, మహేందర్, హుస్సేన్, రామ్మూర్తి, శేఖర్, తదితరులున్నారు.

రవీంద్ర ప్లే స్కూల్ వార్షికోత్సవం

నృత్యం చేస్తున్న చిన్నారులు

జగిత్యాల, ఏప్రిల్ 13 : జిల్లా కేంద్రంలోని రవీంద్ర ప్లే స్కూల్‌లో రవీంద్ర ఉత్సవ్ 2024 పేరిట 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇక్కడ పాఠశాల నిర్వాహకులు సుమన్ రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, పాఠశాల డైరెక్టర్ బీ శ్రీధర్ రావు, రజిత, హరిచరణ్ రావు, మౌనిక, హరిచరణ్ రావు, కిషన్, రాజు, పోషకులు ఉన్నారు.

రామకృష్ణ డిగ్రీ పీజీ కళాశాల స్నాతకోత్సవం

స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 13 : పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల స్నాతకోత్సవ, సిగ్నేచర్స్ డే వేడుకలను శనివారం వాసవీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తల ప్రసంగాలు విద్యార్థులను ఆలోచింప చేశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలతో ఉన్న అనుబంధాన్ని తెయజేస్తూ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ ఎన్ఎస్‌వీ విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ, డైరెక్టర్ పల్లెర్ల నరేశ్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, పీజీ ప్రిన్సిపాల్ వెంకటరమేశ్, బీ మల్లేశం, శ్రీనివాస్, అప్సర్, రాకేశ్, విద్యార్థులు ఉన్నారు.

జగిత్యాల వాసికి ఎంఎస్ జనరల్ సర్జరీలో గోల్డ్‌మెడల్

- కోవింద్ చేతుల మీదుగా మెడల్ అందుకున్న అభినవ్

జగిత్యాల, ఏప్రిల్ 13 : జగిత్యాలకు చెందిన డాక్టర్ అరిగెల అభినవ్ ఎంఎస్ జనరల్ సర్జరీలో గోల్డ్‌మెడల్ సాధించాడు. శనివారం పూణేలోని డాక్టర్ వై పాటిల్ విద్యాపీఠం ఆడిటోరియంలో మాజీ రాష్ట్రపతి చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు. ఎస్ కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరిగెల అశోక్ కొడుకైన అభినవ్ అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రిసెర్చ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతరం పూణేలోని డాక్టర్‌డీ వై పాటిల్ మెడికల్ కాలేజీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ జనరల్ సర్జరీ పూర్తి చేసిన అభినవ్ ఉత్తమ మార్కులు పొంది గోల్డ్ మెడల్‌ను సాధించాడు. ప్రస్తుతం మల్లారెడ్డి మెడికల్ కాలేజీలో జూనియర్ రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అభినవ్

బీసీ రిజర్వేషన్లకు ఆద్యుడు బీపీ మండల్

- గొర్రెకాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుక రాజు



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 13 : బీసీల రిజర్వేషన్లకు ఆద్యుడు బీపీ మండల్ అని జగిత్యాల జిల్లా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎలుక రాజు అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ 42వ వర్ధంతి, గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం నాలుగో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, ఉపాధ్యక్షుడు లచ్చన్న, తొట్ల లక్ష్మీరాజం, జక్కుల తిరుపతి, అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ వర్ధంతిని నిర్వహించారు. ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈశ్వరయ్య, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్, బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు రాంచందర్, యూత్ కోఆర్డినేటర్ హృషికేశ్, నాయకులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో పోలీసులు సోదాలు

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు తనిఖీలు
- నగదు స్వాధీనం, పలువురిపై కేసునమోదు

ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో శనివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ, చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు.

ఇబ్రహీంపట్నం : సోదాలు చేస్తున్న పోలీసులు

ధర్మపురి, ఏప్రిల్ 13 : ధర్మపురి పట్టణంలోని పలువురు వ్యాపారుల ఇండ్లల్లో పోలీసులు సోదాలు చేసి రూ.6.23లక్షల నగదుతో పాటు 65 ప్రామిసరీ నోట్లు, 23 బాండ్ కాగితాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాం నర్సింహారెడ్డి తెలిపారు. డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు ఉమాసాగర్, శ్రీధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది రెండు టీం లుగా ఏర్పడి సోదాలు చేశారు. పట్టణంలోని ఫైనాన్స్, చిట్టీ వ్యాపారులైన వేముల సత్యనారాయణ, చుక్క శంకర్, అక్కనపల్లి సంపత్, తోట రవిరాజా, బండపెల్లి సత్తయ్య, సాక సత్యనారాయణ, సీరపతి రాజన్న, సయ్యద్ ఆసిఫ్, గుండ రమేశ్ ఇండ్లు, కార్యాలయాల్లో రైడ్ చేసి రూ.6.23 లక్షల నగదుతోపాటు 65 ప్రామిసరీ నోట్లు, 23 బాండ్ కాగితాలు స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీరంతా ఎలాంటి లైసెన్సులు, అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు అధిక వడ్డీకి రుణాలు ఇస్తూ, ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు తీసుకొని, కలెక్షన్ పేరుతో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు.

కోరుట్ల, ఏప్రిల్ 13 : పట్టణంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అరిశెల్లి రాజేశం ఇంటిలో రూ.1.28 లక్షల నగదు, రూ.69 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 : మండలంలోని గోధూర్, సత్తక్కపల్లి, మేడిపల్లి గ్రామాల్లో వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. గోధూర్ వాసి బండి పురుషోత్తం వద్ద నుంచి రూ.8 లక్షల విలువైన 17 ప్రామిసరీ నోట్లతో పాటు ఒక బ్లాంక్ చెక్, స్మాల్ నోట్‌బుక్స్ 23, మీడియం నోట్‌బుక్స్ 2 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం రూ.8.33లక్షల విలువైన వాటిని స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. సత్తక్కపల్లెకు చెందిన అరెళ్ల రాజగౌడ్ వద్ద రూ.36.45లక్షల విలువైన 18 ప్రామిసరీ నోట్లు నగదు రూ.1.69లక్షలు స్మాల్ నోట్ బుక్స్ 18, మీడి యం నోట్‌బుక్ 1, లాంగ్ నోట్‌బుక్ 1 మొత్తం రూ. 38,14370 విలువైన ప్రామిసరీ నోట్స్, నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

మారుతీనగర్, ఏప్రిల్ 13 : మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన ర్యాగల్ల వెలయేశ్వర్ వద్ద నుంచి రూ.15 లక్షల విలువైన రెండు ప్రామిసరీ నోట్లు, 18 ఖాళీ చెక్కులు, రూ.3లక్షల నగదు, వేంగంటి భూమేశ్వర్ వద్ద నుంచి రూ.63 లక్షల విలువైన మూడు ప్రామిసరీ నోట్లు, 7 ఖాళీ చెక్కులు, రూ.లక్ష నగదు, ద్యావనపెల్లి రాజారాం వద్ద రూ.5లక్షల 70వేల విలువైన 20 ప్రామిసరీ నోట్లు, రూ.లక్ష నగదు మొత్తం రూ.87లక్ష ల విలువైన 32 ప్రామిసరీ నోట్లు, 26 ఖాళీ చెక్కులు, రూ.5లక్షల నగదును సీజ్‌చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి వివరించారు.

ధర్మారంలో మాధవరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్

రాజకీయ కక్షతోనే మాధవరావుపై కేసు

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ధర్మారం, ఏప్రిల్13: కాంగ్రెస్ సర్కారు రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సల్వాజి మాధవరావుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయించిందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. శనివారం పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మాధవరావు తల్లిదండ్రులను ఈశ్వర్ పరామార్శించారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై ఏనాడు కక్ష సాధించలేదన్నారు. మాధవ రావుపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దీనిపై రామగుండం సీపీని కలిసినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు పూస్కూరు రామారావు, కూరపాటి శ్రీనివాస్, దేవి వంశీక్రిష్ణ, ఆవుల లత, మోకెనపల్లి రాజమ్మ, దేవి రాజేందర్,దేవి రేణుక,చిదుగు సంపత్, గంధం తిరుపతి తదితరులు ఉన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

కోరుట్ల : అగ్నిమాపక వారోత్సవాల గోడ ప్రతికను ఆవిష్కరిస్తున్న మున్సిపల్, అగ్నిమాపక దళ అధికారులు

కోరుట్ల, ఏప్రిల్ 13: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల గోడ పత్రికను మున్సిపల్, అగ్నిమాపక దళ అధికారులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా 'అగ్ని ప్రమాదాలను ఆరికడుదాం, జాతి సందపను కాపాడుకుందాం' అనే నినాదంతో అగ్నిమాపక వారోత్సవాలను ఏప్రిల్ 14 నుంచి 20 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మెట్‌పల్లి అగ్నిమాపక అధికారి మల్లికార్జున్ యాదవ్ తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రం, మెట్‌పల్లి ఫోన్ నంబర్లు 8712699236, 8712699237, 08725 235101లో సంప్రదించాలని కోరారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, కోటేష్, రమేశ్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ మత విధానాలను ఎండగడుదాం

కోరుట్ల, ఏప్రిల్ 13: కేంద్రంలోని బీజేపీ సర్కార్ అవలంభిస్తున్న మత విధానాలను ఎండగడుదామని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో శనివారం వామపక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొచ్చిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని వారు పేర్కొన్నారు. బీజేపీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆదివారం చేపట్టిన సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, రాంబాబు, సమీర్, తిరుపతి నాయక్, చింత భూమేశ్వర్, రమేశ్